# ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్

సి.హెచ్. వెంకటేశ్వరరావు



**భర్తకి కాఫీ అందిస్తూ వెంకటలక్ష్మి "ఏవండీ! ఇవాళ బాబిగాడి స్కూల్ టీచర్ కబురు పంపించిందండీ ..! అంది.**

**సుబ్బారావు తాపీగా కాఫీ తాగుతూ ఆమెను చెప్పమన్నట్లు చూశాడు.**

**"మీరు బాబిగాడి కోసం బయట కొన్న పుస్తకాలు అవీ పనికిరావు ... మళ్లీ అన్నీ స్కూల్లో అమ్మేవే కొనుక్కోమని కబురు పంపిందండీ .." అంది.**

**ఆమె మాటలు వినేసరికి సుబ్బారావు మొహం వివర్ణమయింది.**

అతను ఆవేశంగా, "ఛీఛీ ... ! ఈ కాన్వెంట్ చదువులంటే మెడకి గుదిబండ తగిలించుకున్నట్లే తయారయ్యాయి. ఎంత డబ్బు పోసినా వాళ్ళ దాహం తీరదు. అయినా అన్నీ వాళ్ళిచ్చిన లిస్ట్ ప్రకారమే కొన్నప్పుడు ఇంక అవి బయట కొంటేనేమి .. స్కూల్లో కొంటేనేమి?

మొన్నటికి మొన్న బాబిగాడ్ని స్కూల్లో చేర్చుకునేందుకు డొనేషననీ, బిల్డింగ్ ఫండనీ, రిజిస్ట్రేషననీ, ఎంట్రన్స్ ఫీజనీ - రకరకాల పేర్లతో బోలెడంత డబ్బు గుంజారు. ఇంకా అది సరిపోనట్లు సైడ్ బిజినెస్‌గా ఈ పుస్తకాల వ్యాపార మొకటి ఛా! అసలివి విద్యాసంస్థలో, వ్యాపార సంస్థలో తేడా తెలీడం లేదు", అన్నాడు.

భర్త మాటల్ని అందుకొంటూ వెంకటలక్ష్మి, "ఆ! నేను ముందు నుండి మొత్తుకుంటూనే ఉన్నా ... మనలాంటి మధ్యతరగతి వాళ్లం ఆ ఖరీదైన చదువుల్ని కొనుక్కోలేమని! కానీ మీరు నా మాటెపుడు విన్నారు గనుకా..? గబగబా వెళ్లి జేర్పించి వచ్చారు.

మన పక్కింటి వెంకట్రావుగారు కూడా మీలాగే తొందరమనిషి. ఆయనా వాళ్ళబ్బాయిని ఏదో కాన్వెంటులో వేసొచ్చేశారుట. తర్వాత ఆ ఫీజులు, ఫైనులు కట్టలేక వాళ్లావిడ లబోదిబోమంటోం దిపుడు.

ఫీజు కట్టడం కాస్త ఆలస్యమైతే పదిరూపాయలు ఫైనుట... పిల్లాడు స్కూలుకు ఆలస్యంగా వెళ్తే పదిరూపాయలట... హోంవర్క్ చేసుకు రాకపోతే పది... యూనిఫాం వేసుకురాకపోతే పది .. ఇలా బొట్టు బొట్టూ కలిసి మహాసముద్రమైనట్లు, ఆ ఫీజులు ఫైనులు అవీ మమ్మల్ని ముంచేస్తున్నాయో .. అంటూ ఆవిడ ఒకటే గోల!

తల్లి తండ్రులకి తమ పిల్లలు మంచి చదువులు చదువుకోవాలని ఆశ ఉన్నా, అవి అందుబాటులో లేనపుడు ముందు వెనుకా చూసుకోకుండా, ఎలాగోలా అందులోనే జేర్పించేసి, ఆ తర్వాత బాధపడి ప్రయోజనం ఏముంది..?' అంటూ చిటపటలాడిపోయింది.

ఆమెను సమర్థించనూ లేక, ఖండించనూ లేక సుబ్బారావు కోపంగా చెప్పులేసుకుని విసురుగా బయటికి వెళ్లిపోయాడు.

❋ ❋ ❋


హడావుడిగా చీమల్లా కదులుతున్న జనం మధ్య, సుబ్బారావు నీరసంగా శరీరాన్ని కాళ్ళపై బాలెన్స్ చేస్తున్నట్లు నడుస్తున్నాడు.

సుబ్బారావు దేశానికి అవసరమయిన గుమస్తాలని, కార్మికుల్ని ఉత్పత్తి చేసే మధ్య తరగతికి చెందినవాడు. అతను, తన వర్గ సాంప్రదాయం ప్రకారం ఒక చిన్న కంపెనీలో ఓ చిన్న గుమాస్తాగా చేస్తున్నాడు.

జీతం అందుకున్న ప్రతిసారి అది చూసుకొని, "నా విలువ ఇంతేనా?" అని సిగ్గుపడుతుంటాడు. కానీ ఆ సిగ్గనేది మధ్యతరగతివాడికి చావుతో సమానమని నమ్మే సుబ్బారావు, దానిని షర్ట్‌తో దులిపి విదిలించేసుకుంటూ, అవసరం పడినపుడు, "ఓ టెన్ ఉంటే కొట్టు గురూ ... ఓ ఫిఫ్టీ ఉంటే సర్దండి సార్ ..." అంటూ అప్పో సొప్పో చేస్తూ, తీరుస్తూ, చేస్తూ గుట్టుగా గౌరవంగా బతికేస్తున్నాడు.

ఇంతలో చూస్తూ చూస్తుండగానే స్కూలుకి ఎదిగొచ్చేసిన కొడుకు పెళ్లి కెదిగొచ్చేసిన ఆడపిల్లలా కళ్లముందు తిరుగాడుతూ, అనుక్షణం అతనికి కర్తవ్యం గుర్తుచేయడం మొదలుపెట్టేసరికి, వాడ్ని తమ ఆశల మూటని ఏ మున్సిపల్ బళ్లోనో వేయలేక నలుగుర్నీ విచారించి, వాళ్ళు "పర్వాలేదు ... ఇందులో ఫీజులు నీ రేంజ్‌లోనే ఉండొచ్చు!" అన్న ఓ కాన్వెంటు చూసుకొని, కొడుకుని అందులో జేర్పించివచ్చాడు.

అలా మొదలయింది ... 'ద ఫాల్ ఎండ్ ఫాల్ ఆఫ్ ఏ సుబ్బారావు' అనే కథ.




❊ ❊ ❊

బొయ్ మన్న కారు హారన్ చప్పుడుకి తుళ్ళిపడి, ముసురుకుంటున్న ఆలోచల్ని తరిమేసి చుట్టూ చూశాడు సుబ్బారావు.

కంటికెదురుగా కన్పిస్తున్నదానిని చూసి ఆశ్చర్య పోయాడతను. ఎందుకంటే తన ఆలోచన్లో తను మునిగి తేలుతుంటే, తన మెదడులో ఓ భాగం ఏదో తన తక్షణ సమస్యకి పరిష్కారమయిన డబ్బు పుట్టేచోటు కోసం తీవ్రంగా అన్వేషించి, చివరికి తనని అప్రయత్నంగా అక్కడికి చేర్చినందుకు.

అది అతను పనిచేసే కంపెనీ యజమాని ఇల్లు.

లాన్‌లో కూర్చుని ఏవో ఫైళ్ళు చూసుకుంటున్న చౌదరి గారు, "నమస్కారం సార్!" అని వినపడితే తలెత్తి చూశాడు.

ఎదురుగా సుబ్బారావు కన్పించే సరికి ఆయన ఆశ్చర్యపపోతూ, "నువ్వటోయ్ ..... సుబ్బారావు! ఏంటి.. ఇలా వచ్చావు?" అన్నారు.

సుబ్బారావు తడబడుతూ, నెమ్మదిగా వచ్చిన పని చెప్పాడు. అది విన్న చౌదరిగారి మొహం అప్రసన్నంగా మారిపోయింది.

"ఇలాంటివన్నీ కంపెనీలోనే చూసుకోవాలయ్యా... ఇలాగ ఎపుడు పడితే అపుడు ఇంటిమీదకి వచ్చేస్తే ఎలాగ?'అన్నారు.

సుబ్బారావు సిగ్గుతో కుచించుకుపోతూ, "సారీ సర్! చాలా అర్జెంటుగా అవసరమైతేనూ..." అంటూ అర్థోక్తిలో మాటల్ని మింగేసి నిలబడ్డాడు.

అతని మాటల్ని విననట్లు, ఆయన మళ్లీ ఫైల్సు చూసుకోసాగారు. కాసేపు అలాగే నిలబడి, ఆయన ఏమీ అనకపోతే, సుబ్బారావు నిరశగా, "వస్తాను సార్ ... నమస్కారం!" అంటూ కదిలాడు.


"ఇంతకీ నీ కొడుకుని ఏకాన్వెంటులో వేశావేమిటి?' అన్న చౌదరి గారి ప్రశ్న సుబ్బారావులో మళ్లీ ఆశ రేపింది.

సుబ్బారావు చెప్పాడు.

"ఓ అందులోనా...! మా అబ్బాయి కూడా అందులోనే చదువుతున్నాడు. మేమే అంతంత ఫీజులు అవీ భరించలేకపోతుంటే, మీ వాడ్ని నువ్వెలా చేర్పించేశావోయ్ అంత తెలివి తక్కువగా! వాడ్ని ఏ మున్సిపల్ బళ్లోనో పడేసుంటే, నీకు ఈ రోజిలా జోలి పట్టుకుని వీధిన పడే పనుండేది కాదు కదా" అన్నారు చౌదరిగారు.

సుబ్బారావు అవమానం దిగమింగుతూ, తల దించు కొని దోషిలా నిలబడున్నాడు.

ఒక మామూలు గుమాస్తా కూడా తనలాగే కొడుకు భవిష్యత్తు గురించి కలలు కనడం, తన కొడుకుతో సమానంగా కాన్వెంట్‌లో చదివించడం .. చౌదరిగారిలో అసూయాగ్నిని ఎగదోసింది.



**ప్రాణేశ్వరి**

"నీవే నా హృదయేశ్వరివి!" భార్యతో అన్నాడు భర్త.

"అంతకన్నా... ప్రాణేశ్వరివి అంటే ఇంకా బాగుంటుంది కదండీ!" అంది భార్య మురిసిపోతూ.

"అదెలా కుదుర్తుందీ... అలా పిలిచేది నా ప్రియురాల్ని కదా!" నోరు జారాడు భర్త.

అండే అనిత(చిత్తూరు)

అతనిని గొంగళి పురుగుని చూసినట్లు చూస్తూ "ఎంత కావాలి నీకు?" అని ప్రశ్నించారు.

"వంద రూపాయలు సార్!" చిన్నగా గొణుగుతున్నట్లు అన్నాడు.

"ఆ మాత్రం కూడా కట్టలేనివాడివి మీ కెందుకోయ్ ఆ కాన్వెంట్ చదువులు ... ఆఁ? మింగ మెతుకు లేదు గానీ మీసాలకి సంపెంగ నూనె కావాలంటారు. ఏం మనుషులో ఏమో? ఇంట్లో పెళ్ళాం బిడ్డలకి తిండి పెట్టలేకపోయినా, కొడుకుని కలెక్టరుని చేసేయాలని కలలు కంటారు. నా మాట విను! ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు. నీ కొడుకుని ఏ మున్సిపాలిటీ బళ్ళోనో వేసేయి. వాడూ నీలాగే ఒక డిగ్రీ సంపాదించుకుని, ఏ గుమాస్తాగానో స్థిరపడతాడు. అంతేగానీ పగటి కలలు కంటూ ఇలాగ అడుక్కోవద్దు. డబ్బుదేముంది. కావాలంటే ఇస్తాను గానీ ఆలోచించు!' అన్నారు చౌదరిగారు.

సుబ్బారావు మొహం సిగ్గుతో, అవమానంతో కందిపోయింది. అతని బక్క శరీరం సన్నగా కంపించ సాగింది. వేసుకున్న షర్టు చెమటతో తడిసిపోసాగింది.

ఇంకా అవమానింపబడేందుకు ఓపికలేని సుబ్బారావు, చౌదరిగారి దగ్గిర అనుమతి తీసుకోకుండానే, కదిలాడు. తడబడుతూ, చిన్నగా వణుకుతూ, పెద్దగా అంగ లేసుకుంటూ వెళ్లిపోతున్న సుబ్బారావుని చూస్తూ చిన్నగా నవ్వుకొంటూ, "రాణీ! అతనికో వందరూపాయి లిచ్చి పంపించు..." అంటు భార్యని కేకేసి మళ్ళీ ఫైల్సు చూసుకోసాగారు చౌదరిగారు,

గేటు దాటుతున్న సుబ్బారావుకి ఆ మాటలు వినపడ్డాయి గానీ, ఆగలేదు.

❊ ❊ ❊

సుబ్బారావు గాలికి కొట్టుకుపోతున్నవాడిలా, అగమ్యంగా నడుస్తున్నాడు. హేళన నిండిన చౌదరిగారి స్వరం అతన్ని వెన్నాడుతుంటే, దానికి దూరంగా పారిపోవడాని కన్నట్లు, వేగంగా అడుగులు వేస్తున్నాడు.

'మీకెందుకోయ్ ఆ కాన్వెంట్ చదువులు... మింగ మెతుకు లేదుగానీ పెళ్ళాం బిడ్డలకి తిండిపెట్టలేనివాడివి హాహాహా.... కొడుకుని కలెక్టర్ చేస్తాడంట. నా మాట విను హాహా... ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు... మీ వాడు కూడా నీలాగే హాహా... దశకంఠుడి వికటాట్టహాసంలా చౌదరిగారి గొంతు సుబ్బారావు చెవుల్లో మారుమోగి పోతోంది.

హఠాత్తుగా అతను నడక ఆపి నిలబడిపోయాడు. ఒంటి నుండి ధారాపాతంగా చెమట కారిపోసాగింది. అతనిలో ఎన్నో భావాలు ....

'అవును! మింగ మెతుకు లేనివాడ్ని ... మా కెందుకు కాన్వెంట్ చుదువులు? నేను పొరపాటు చేశాను. చాలా పెద్ద పొరపాటు. దేశానికి గుమస్తాల నందించవలసిన మహత్తరమైన బాధ్యత నా భుజస్కందాల మీద ఉందనే

సంగతి మరిచిపోయి, నా కొడుకుని పల్లకీలో కూర్చోపెట్టాలని చూశాను. అది దురాశ కాకపోతే మరేమిటి?

కాన్వెంట్లలో అమ్మబడే చదువు కొనుక్కునే స్థోమత తన కెక్కడిది? అది సరస్వతీదేవిని వేలంపాటలో కొనుక్కోగలిగే డబ్బున్నవాళ్ళకి. ఆ డబ్బు నా దగ్గిర లేదు. కనుక నేను అసమర్థుణ్ని. నా కొడుకు అనర్హుడు. ఇదేదీ అర్థం చేసుకోకుండా, ఆ కాన్వెంట్లు నన్ను దోచేసుకుంటు న్నాయో అని వాపోతూ గావుకేకలు పెట్టడం ఎంత అవివేకం?

మాలాంటి మధ్యతరగతి వాళ్ళకోసమే కదా ప్రభుత్వం బళ్ళు నడుపుతున్నది. అందులో చదువులు చెప్పకపోతేనేమి? కాన్వెంట్లని నియంత్రించక పోతేనేమి? ఏమీ అర్థం చేసుకోలేని గొర్రెల జాతి మా మధ్యతరగతి' ' విరక్తిగా నవ్వుకోసాగాడు సుబ్బారావు.

"ఏం గురూ మందెక్కువయ్యిందా ఏంటి?" ఆటోవాడి పలకరింపు.

సుబ్బారావు గట్టిగా నవ్వుతూ, "కొడుకు చదువుకి డబ్బు కోసం తడుముకొంటున్న నాకు మందు హా! దానికి డబ్బెవరిస్తారు?" అనుకొన్నాడు.

"పాపం పిచ్చోడిలా ఉన్నాడు!" సుబ్బారావుని జాలిగా చూస్తూ కదిలిపోయాడు ఆటోవాడు.

"హాహాహా ! పిచ్చోడ్నే! కాన్వెంట్ చదువుల పిచ్చోడ్ని'

❊ ❊ ❊

శరీరంలో ఓపికున్నంతవరకు ఉన్మాదిలా రోడ్లన్నీ తిరిగాడు. అలిసిపోయి, నీరసంగా మొహం వేలాడేసుకుని ఇంట్లోకి వస్తున్న భర్తని చూసి, వెంకటలక్ష్మి స్త్రీహృదయం కలుక్కుమంది.

'ఛీ ! పాపిష్టి దాన్ని! ఆయన్ని అర్థం చేసుకొని తోడుగా నిలబడి సాయపడవలసింది పోయి, నోటికి వచ్చినట్లు వాగేసి ఆయన మనస్సు గాయపరిచాను' అని లోలోన పశ్చాత్తాప పడుతూ, నెమ్మదిగా భర్తని సమీపించి, అనునయంగా అతని భుజంపై చేయివేసింది.


సుబ్బారావు భార్య కళ్ళల్లోకి చూశాడు. ఆమె కళ్లలో ఆర్ద్రత ... ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. మౌనంగా కాసేపు అలాగే ఉండిపోయా రిద్దరూ.

చివరికి వెంకటలక్ష్మి నెమ్మదిగా, "ఏమండీ! నేను మా అన్నయని కొంచెం డబ్బు సర్దమని రాస్తాను. వాడు తప్పకుండా పంపిస్తాడు. అది రాగానే ఆ పుస్తకాలు అవీ కొందురుగానీ. ఇంక మీరు దాని గురించే ఆలోచిస్తూ మనస్సు పాడుచేసుకోకండీ" అంది.

సుబ్బారావు తప్పు చేసినట్లు తల దించుకొని, "వద్దు లక్ష్మీ! రేపే బాబిగాడ్ని కాన్వెంట్ మాన్పించేస్తాను. వాణ్ణి మున్సిపల్ బళ్ళో వేసేద్దాము" అన్నాడు.

వెంకటలక్ష్మి భర్తని దిగులుగా చూసింది.

❊ ❊ ❊




"డాడీ.. డాడీ.. డాడీ..." అని పెద్దగా అరుస్తూ తుఫానులా ప్రవేశించాడు బాబిగాడు.

పరిగెత్తుకు వచ్చి తండ్రిమీదకి దూకి, మెడని వాటేసుకొన్నాడు. ఆటలు ఆడి అలిసిపోయిన వాడి నుదుటిన చిరుచెమట ముత్యాలు లైటు వెలుతురులో మెరుస్తున్నాయి.

చేతులకి అంటుకొన్న మట్టిని, ఒంటికి పట్టిన చెమటని అంతా తండ్రి బట్టలకే పులిమేస్తూ, కిలకిలా నవ్వుతూ, తండ్రి మెడ పట్టుకుని ఊయల ఊగసాగాడు.

చిరుకోపంతో చూస్తున్న తల్లిని, 'వ్వెవ్వెవ్వె!' అంటూ నాలిక బయట పెట్టి వెక్కిరించాడు. తల్లిని ఉడికించు తున్నట్లు తండ్రి బుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

అంతవరకు వారి మనసుల్లో పేరుకుపోయిన దిగులుని, దుఃఖాన్ని తన అల్లరితో ఒక మహామాంత్రికునిలా మాయం చేశాడు ఆ చిన్ని కృష్ణుడు! వాడి ఆటల్ని మురిపెంగా చూస్తున్న భార్యాభర్తల మొహాలు ఆనందంతో పున్నమి చంద్రునిలా వెలిగిపోయాయి.

"ఒరేయ్ బాబీ! చదువుకోకుండా ఎపుడూ ఆటలేనా నీకు బాగా అల్లరి ఎక్కువయిపోయింది" అని కొడుకుని ముద్దుగా విసుక్కుంది వెంకటలక్ష్మి.

"నేనేమీ అల్లరి చేయట్లేదు. డాడీతో ఆడుకుంటున్నాను. కదూ డాడీ!" అంటూ తండ్రి మద్దతు కోసం బుగ్గమీద ఓ ముద్దు లంచంగా ఇచ్చేశాడు.

సుబ్బారావు బెట్టుగా, "నువ్వల్లరి చేస్తున్నావనీ మీ మమ్మీ అంటోంది కదా. మరి నువ్వు గుడ్ బాయ్‌వా? బాడ్ బాయ్‌వా?" అడిగాడు.

"నేనా... నేను వెరీ వెరీ వెరీ వెరీ గూ...డ్ బాయ్‌ని! కావాలంటే మా టీచర్ని అడగండి. నేను చాలా బాగా చదూకొంటానని, మరేమో... మా టీచరు నన్నెప్పుడూ గూ...డ్ బాయ్ అని అంటుంది తెల్సా? మిలమిల మెరుస్తున్న కళ్ళతో, మొహంలో ఆనందం, కొద్దిగా గర్వం తొణికిసలాడు తుంటే కొడుకు బాబీ జవాబు చెప్పిన తీరు వారిని ముగ్ధుల్ని చేసి పరవశపరిచింది.

సుబ్బారావు మనస్సులో ప్రతిజ్ఞ చేసుకొంటున్నాడు, 'నా కొడుకు కళ్ళలో ఆ మెరుపు, ఆ ఆనందం శాశ్వతంగా నిలిపేందుకు నేను ఎంత కష్టమైనా పడతాను. ఎంతటి అవమానం అయినా భరిస్తాను. కానీ నా కొడుకు భవిష్యత్తుని నా దారిద్ర్యానికి బలి చేయను. ఎట్టి పరిస్థితుల్లో కూడా' అని!

వెంకటలక్ష్మిలో కూడా అవే భావాలు కదలాడు తున్నాయి. తల్లితండ్రుల ఆ బలహీనతలే 'విద్యా వ్యాపారస్థు'లకు మూలధనం అని వారికి తెలియదు.

ఆమె ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ లేచి వంటింట్లోకి వెళ్ళింది. దేవుడి పటానికి దణ్ణం పెట్టుకొని లెంప లేసుకొంది. దీర్ఘాలోచనలో మునిగిన్న భర్త దగ్గిరకి వచ్చి, మౌనంగా అతని చేతిలో మంగళసూత్రాలుంచింది.

చివాల్న తలెత్తిన సుబ్బారావుకి, బోసిపోయిన ఆమె మెడలో పసుపుతాడు ... దానికి వేలాడుతున్న పసుపుకొమ్ము కనబడ్డాయి.

అతని కళ్ళలో పొంగిన అశ్రుధార ... చిర్నవ్వుతో తడి కళ్ళతో ఎదురుగా నిలబడిన భార్యని చూడనీయలేదు.

'లక్ష్మీ!' అంటూ ఆర్తిగా ఆమెని దగ్గరికి తీసుకొన్నాడు. కొడుకు ఆడుకొంటూ తనలో తను "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్... హౌ ఐ వండర్ వాట్ యూ ఆర్?" అంటూ పాడుతున్న రైమ్‌ని విన్న సుబ్బారావుకి మెల్లమెల్లగా జ్ఞానోదయం అవుతోంది.

అది నిగూఢమైన సందేశం ఏదో అందిస్తున్నట్లు అనిపించ సాగింది. అది తమవంటి పేద తల్లి దండ్రులకోసమే వ్రాయబడినట్లుగా కూడా అనిపించు తోంది. ఎందుకో మరి....? ❊